క్లుప్తంగా

హైదరాబాద్ వెళ్లి పింఛన్ అందచేత



హైదరాబాద్ వెళ్లి బాధితురాలికి పింఛన్ అందజేస్తున్న బాలకృష్ణ

పుల్లలచెరువు: పుల్లలచెరువుకు చెందిన బత్తుల రమణ ఆరోగ్యం బాగ లేకపోవడంతో హైదరాబాద్‌లోని వైద్యశాలలో ఆపరేషన్ చేయించుకుంది. రమణకు పింఛన్ ఇవ్వాలని వలంటీర్ మాలపాటి బాలకృష్ణ రమణ ఇంటికి వెళ్లగా కుటుంబ సభ్యులు ఆమె గురించి తెలిపారు. వెంటనే బాలకృష్ణ తన సొంత ఖర్చులు పెట్టుకుని హైదరాబాద్ వెళ్లి వైద్యశాలలో ఉన్న రవమణకు పింఛన్ అందచేశారు. కేవలం ఆదివారం చివరి తేదీ కావడంతో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో వెళ్లి ఇచ్చినట్లు ఆయన తెలిపారు. గ్రామస్తులు, రమణ కుటుంబ సభ్యులు బాలకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని లక్కవరం గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నారని ఎస్సై వైవీ రమణయ్యకు వచ్చిన సమాచారం మేరకు దాడి చేసి 46 మద్యం బాటిళ్లు పట్టుకుని ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఏడుకొండలు షాపులో 8 బాటిళ్లు, దేవెళ్ల రమణమ్మ ఇంట్లో 38 బాటిళ్లు రైడ్ చేసి పట్టుకున్నారు. మద్యం బాటిళ్లను సీజ్ చేసి వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.
ముండ్లమూరు: మండలంలోని పసుపుగల్లు, పోలవరం, వేములబండలో అమ్ముతున్న 49 అక్రమ మద్యం బాటిళ్లను ఎస్‌ఐ యూవీ కృష్ణయ్య ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. పసుపుగల్లులో కాకునూరి ఏడుకొండలు వద్ద 17, పోలవరంలో కొణతం అక్కిరెడ్డి వద్ద 25, వేములబండలో దిగుడు తిరుపతిరావు వద్ద 7 మద్యం బాటిళ్లను షాపుల్లో విక్రయిస్తుండగా దాడి చేసి పట్టుకుని బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో నాగూర్ మీరావలి గంధ మహోత్సవం



గంధ గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కురిచేడు: శ్రీనాగూర్ మీరావలి గంధ మహోత్సవం ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కులమతాలకతీతంగా నిర్వహించే ఈ మహోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అన్నదానం , సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆట గుర్రంపై గంధాన్ని ఉంచి గ్రామోత్సవం చేశారు.

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్లు కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి అర్చనలు, సహస్రనామ, కుంకుమ పూజలు, అఖండ హారతి పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

రుద్రసముద్రంలో వికసిత భారత్ సంకల్ప యాత్ర

దొనకొండ: మండలంలోని రుద్రసముద్రం, మల్లంపేట గ్రామాల్లో ఆదివారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని వక్తలు కొనియాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని బీజేపీ నాయకులు వివరించారు. ఏఓ ఎన్.లక్ష్మీనారాయణ, ఏపీఎం జి.వెంకటేశ్వర్లు, హౌసింగ్ సూపర్‌వైజర్ సురేష్, హెల్త్ సూపర్‌వైజర్ ప్రభావతి, చెన్నుబోయిన గురుమూర్తి పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామి ఆలయంలో అధ్యయన ఉత్సవాలు



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

మార్కాపురం టౌన్: ధనుర్మాసం సందర్భంగా చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామివారికి, శ్రీ రామానుజచార్యులవారికి అధ్యయన ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం 6 గంటలకే స్వామివారికి పంచామృతాభిషేకాలు, పంచామృత స్నానం, తోమాల సేవలు నిర్వహించారు. ఉత్సవాల్లో ఆలయ చైర్మన్ పెనుగొండ కేశవరావు, ఈఓ శ్రీనివాసరెడ్డి, పలువురు ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

ఆనందమానందమాయే..

- పింఛను పెంపుపై మాట నిలబెట్టుకున్న సీఎం జగన్
- అవ్వాతాతల మోములో చిరునవ్వు



గనివానిపాడులో సీఎం వైఎస్ జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న పింఛన్‌దారులు

కొనకనమిట్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఒక్కొక్క హామీని నెరవేర్చుతుండటంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. కొత్త ఏడాదిలో వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళల పింఛను రూ.3 వేలకు పెంచి ఇస్తుండటంతో అవ్వాతాతల మోములో చిరునవ్వులు పూస్తున్నాయి. మేనిఫెస్టోలో పేర్కొన్న ప్రకారం వైఎస్సార్ పింఛన్ కానుకను ఏటా పెంచుతూ రూ.3 వేలు అందజేస్తామని ప్రకటించిన విషయం అందరికి తెలిసిందే. మొదట్లో రూ.2 వేలు ఉన్న వృద్ధాప్య పింఛన్‌ను రూ.2250 నుంచి రూ.3 వేలకు పెంచారు. ఒకటో తేదీ ఉదయమే గ్రామ వలంటీర్లు అర్హుల ఇంటికి వెళ్లి పింఛన్ నగదుఅందజేస్తున్నారు. దీంతో లబ్ధిదారులు పట్టరాని ఆనందంతో సంతోషం వ్యక్తం చేస్తూ వాడవాడలా సీఎం చిత్ర పటాలకు క్షీరాభిషేకాలు చేస్తున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

మార్కాపురం నియోజకవర్గంలో సుమారు 27 వేల మంది పింఛన్‌దారులు ఉన్నారు. వారికి ప్రతినెలా సుమారు రూ.8 కోట్లకు పైగా పెన్షన్‌దారులకు నగదు పంపిణీ చేస్తున్నారు. మార్కాపురం మండంలో 7 వేల మంది, కొనకనమిట్ల మండలంలో 6,500 మంది, పొదిలి మండలంలో 7,500 మంది, తర్లుపాడు మండలంలో 6 వేల మంది పెన్షన్ పొందుతున్నారు. వీరందరికి ఈ నెల నుంచి పెంచిన రూ.250తో కలిపి రూ.3 వేల నగదును వలంటీర్ల ద్వారా ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేస్తున్నారు.

ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు



ఇచ్చిన హామీని సీఎం వైఎస్ జగన్ నిలబెట్టుకున్నారు. ఎన్నికల సమయంలో పింఛను సొమ్మునూ ఏటా పెంచుకుంటుపోతానని ఇచ్చిన జగన్ ఎక్కడా మడమ తిప్పలేదు. ఈ నెల పింఛను రూ.3 వేలు ఇచ్చారు. మా మద్దతు జగన్‌కు ఎల్లప్పుడూ ఉంటుంది.

– పోతిపోగు రాజశేఖర్, ముమ్మాయపాలెం

తండ్రిని మించిన తనయుడు జగన్



పేదల సంక్షేమ కోసం పాటు పడిన వైఎస్సార్ మాదిరిగానే ఆయన తనయుడు సీఎం జగన్ పేదల కష్టాలు తెలుసుకుని వారికి అండగా ఉంటడం సంతోషంగా ఉంది. నేను ఆరోగ్యం బాగాలేక హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాను. గ్రామానికి రాలేనని తెలుసుకున్న మా వలంటీర్ నరసయ్య హైదరాబాద్ వచ్చి రూ.3 వేలు పింఛన్ ఇచ్చాడు. పింఛన్ రూపంలో నాలాంటి వృద్ధులకు భరోసా కల్పించిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

– వాకా వెంకటేశ్వరరెడ్డి, నాయుడుపేట

పెన్షన్‌దారులకు భరోసా



వృద్ధాప్యంలో పింఛన్ రూపంలో ప్రతి నెలా రూ.3 వేలు ఇవ్వడం వల్ల పెన్షన్‌దారులకు ఎంతో భరోసా దక్కుతోంది. ఒకరిమీద ఆధారపడకుండా ఆ డబ్బులు అవసరాలకు ఉపయోగించుకుంటున్నాం. పింఛను పెంచడం ఆనందంగా ఉంది. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల కష్టాలు తీరుస్తున్న సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– చిరుగూరి పెదరాజులు

పట్టుదలతో చదివితే మంచి మార్కులు



సుబ్బారెడ్డిని సన్మానిస్తున్న ఎంఈఓ నాయక్, పక్కన మల్లికార్జునరెడ్డి

మార్కాపురం: పట్టుదల, కృషితో చదివితే పదో తరగతి విద్యార్థులు మంచి మార్కులు సాధించవచ్చని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు పోకల సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ అన్‌ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో మార్కాపురం డివిజన్‌లోని వివిధ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న 600 మంది విద్యార్థులకు ఆదివారం పట్టణంలోని డి కన్వెన్షన్ హాల్లో డివిజన్ అధ్యక్షులు జి.మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్, ఓరియంటేషన్ తరగతులు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఈ రెండు నెలలూ అకుంఠిత దీక్షతో చదవాలని సూచించారు. ఎంఈఓ రాందాస్‌నాయక్ మాట్లాడుతూ.. తల్లిదండ్రుల ఆలోచనలకు అనుగుణంగా సెల్‌ఫోన్లను దూరంపెట్టి ఇష్టంతో కష్టపడి చదవాలని సూచించారు. ఓరియంటేషన్ క్లాసులు ఇంకా నిర్వహిస్తామని ప్రతినిధులు మల్లికార్జునరెడ్డి, రంగయ్య, శ్రీనివాసరావు, వికాస్ శ్రీనివాసరావు తెలిపారు.

పరీక్షలపై విద్యార్థులు ఆందోళన చెందవద్దు



ప్రశ్నపత్రాలను విడుదల చేస్తున్న హెచ్‌ఎం, నాయకులు

మార్కాపురం టౌన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలపై విద్యార్థులు భయాన్ని వీడి ప్రశాంత వాతావరణంలో రాసినప్పుడే మంచి మార్కులు పొందుతారని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఎస్‌ఎఫ్‌ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రజ్ఞా వికాస పరీక్షలో భాగంగా బాలుర ఉన్నత పాఠశాలలో మోడల్ పదో తరగతి పరీక్ష పత్రాలను విడుదల చేసి విద్యార్థులకు అందచేశారు. హెచ్‌ఎం మాట్లాడుతూ.. విద్యార్థులు మాక్ టెస్టుల్లో పాల్గొనడం వల్ల మార్చి 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పబ్లిక్ పరీక్షల్లో భయం ఉండదన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఓవీ వీరారెడ్డి, కార్యదర్శి ప్రభాకర్, రాష్ట్ర కౌన్సిలర్ శ్రీరాములు, యూటీఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పాపయ్య, వెంకటేశ్వర్లు, యలమందారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసులు, రమేష్‌రెడ్డి, కె.విజయ్, ఏనుగుల శివ, జేవీవీ నాయకులు ఏనుగుల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి రథం, ఫ్రీజర్లు వితరణ



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

పొదిలి: మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు పొదిలికి చెందిన త్రావణి వెంకటేశ్వర్లు శాంతి రథం సమకూర్చారు. కాటూరి పెద్దబాబు, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, డాక్టర్ యర్రం వెంకటరెడ్డి మూడు ఫ్రీజర్ బాక్సులను అందజేశారు. వీటి సేవలు ఆదివారం నుంచి ప్రజలకు అందుబాటులో ఉంటాయని సంస్థ వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక ఎస్వీ గార్డెన్స్‌లో సర్వసభ్య ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. స్థానిక కమిటీ ఆధ్వర్యంలో నిత్యం ఏదో ఒక సేవా కార్యక్రమం చేపడుతున్నామని, జిల్లా స్థాయి కార్యక్రమాలు పొదిలిలోనే నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, కమిటీ సభ్యులకు మెమొంటోలు అందజేశారు. దాతల దంపతులతోపాటు నూర్జహాన్ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ముప్పల పార్థసారథి, కల్లం వెంకట సుబ్బారెడ్డి, షేక్ నూర్జహాన్, యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వెలిశెట్టి నారాయణ, శామంతపూడి నాగేశ్వరరావు, యక్కలి శేషగిరిరావు, పులిగొర్ల శ్రీనివాసరావు, సోమిశెట్టి చిరంజీవి, బండి అశోక్, దర్నాసి రామారావు, షేక్.యాసిన్, గూడూరి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



వాగులో పడిపోయిన మోటార్ బైక్ రిక్షా

బేస్తవారిపేట: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన మండలంలోని పాపాయిపల్లె సమీపంలో ఒంగోలు–నంద్యాల హైవేపై ఆదివారం జరిగింది. చిన్నపాటి ప్లాస్టిక్ సామాన్లు, గాజులు అమ్ముకునేందుకు రిక్షాకు మోటార్ బైక్‌ను ఏర్పాటు చేసుకుని దర్శిలోని పుట్టబజార్‌కు చెందిన ఎం.కొండయ్య పొదిలి వైపు వెళ్తున్నాడు. పాపాయిపల్లె సమీపంలో వాగుపై ఏర్పాటు చేసిన చప్టాపై అదుపుతప్పి వాగునీటిలో పడిపోయాడు. కొండయ్య చేతులు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రుడిని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీలకు పొదిలి విద్యార్థుల ఎంపిక



విద్యార్థులకు మెమొంటోలు అందిస్తున్న దేవప్రభాకర్

పొదిలి: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో స్థానిక గీతాంజలి ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎస్‌కే ఐమన్, ఎస్‌కే హిప్జా, కె.ఈశ్వర్ జిల్లా స్థాయి పోటీల్లో మొదటి స్థానం పొందడంతో రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. వీరికి పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో అభినందనలు తెలిపారు. చైర్‌పర్సన్, కరస్పాండెంట్ కె.భాగ్యలక్ష్మి, జేవీవీ కార్యదర్శి దేవప్రభాకర్ మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రశాంతి పాల్గొన్నారు.

అయోధ్య అక్షతలతో హిందువుల ర్యాలీ



అయోధ్య అక్షతలతో ఊరేగింపు నిర్వహిస్తున్న హిందువులు

గిద్దలూరు రూరల్: అయోధ్య రామమందిరం నిర్మాణం సందర్భంగా హిందువులు పట్టణంలోని యాదవ బజారు, పాండురంగారెడ్డి నగర్, యల్లావారి వీధుల్లో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గిద్దలూరు నియోజకవర్గాల దేవాలయాల కమిటీ కన్వీనర్ చేరెడ్డి ఎర్రారెడ్డి మాట్లాడుతూ ప్రతి హిందువు వద్దకు అయోధ్య అక్షతలు చేరుతాయన్నారు. రామ మందిరం ప్రతి హిందువు చిరకాల కోరిక అని, అది నెరవేరే సమయం దగ్గర పడటం అదృష్టంగా భావించాలన్నారు. విశ్వ హిందూ పరిషత్ సభ్యులు బూజుమేకల రాజు, అభయాంజనేయస్వామి ఆలయం కమిటీ అధ్యక్షురాలు పాలుగుళ్ల అనసూయ పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

కొనకనమిట్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఉదయం 10 గంటలకు నూతనంగా మంజూరైన పింఛన్లను ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ అద్దంకి శ్రీనివాసమూర్తి తెలిపారు. మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో నూతనంగా 300 మందికి వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ పింఛన్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. లబ్ధిదారులను కొనకనమిట్ల మండల కార్యాలయానికి తీసుకురావాలని సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు ఎంపీడీఓ సూచించారు.

కోనపల్లె ఫారెస్ట్‌లో బెల్లం ఊట ధ్వంసం



బెల్లంఊటను ధ్వంసం చేస్తున్న సీఐ, ఎస్సై

బేస్తవారిపేట: మండలంలోని కోనపల్లె అటవీ ప్రాంతంలో నాటుసారా స్థావరాలపై కంభం సీఐ రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం తనిఖీలు చేశారు. నాటుసారా తయారీకి ఉపయోగించే 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. నాటుసారా తయారు చేసినా, అమ్మకాలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని, గ్రామాల్లో నాటుసారా అమ్మకం, కోడి పందెం, పేకాట ఆడే వ్యక్తుల సమాచారం పోలీసులకు అందించాలని సీఐ కోరారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. ఎస్సై బి. నరసింహారావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీరాముని శోభాయాత్ర



స్వామివారి నగరోత్సవంలో పాల్గొన్న భక్తులు

మార్కాపురం: అయోధ్యలో శ్రీరాముని ప్రతిష్ఠా మహోత్సవాల సందర్భంగా ఆదివారం స్థానిక షిరిడీ సాయి బాబా మందిరం ఆధ్వర్యంలో స్వామివారి శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. మందిర అధ్యక్ష కార్యదర్శులు పేరం సత్యనారాయణ, హరిహరరావుతో పాటు పలువురు మహిళా భక్తులు శ్రీరామచంద్రుని చిత్రపటం కటౌట్‌తో నాలుగు మాఢ వీధుల్లో ఉత్సవం నిర్వహించి భక్తులకు అయోధ్య నుంచి వచ్చిన అక్షతలు అందించారు. కార్యక్రమంలో కోశాధికారి నాగరాజు, ఉపాధ్యక్షులు గోపి, విశ్వహిందూ పరిషత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈనెల 22న శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ రోజున భక్తులందరూ స్వామివారి అక్షతలు శిరస్సుపై వేసుకోవాలని, ప్రతి గృహంలో 5 దీపాలు వెలిగించాలని కోరారు. కార్యక్రమంలో మహిళా ప్రతినిధులు బొంతల భారతి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చెంచు గిరిజనులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని బలిజేపల్లి గిరిజన గూడెం చెంచు గిరిజనులకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. స్పందించే హృదయాలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పులి శ్రీనివాసప్రసాద్ ఆధ్వర్యంలో గూడెంలోని 25 కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ శీతాకాలంలో చలి తీవ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో చెంచు గిరిజనులకు రాజస్థాన్ దుప్పట్లను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో ట్రస్ట్ రాష్ట్ర సభ్యులు తన్నీరు బాల రంగారావు, వలంటీర్ బాలరాజు నాయక్ పాల్గొన్నారు.

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: పట్టణ శివారులోని అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఆలయ అర్చకులు వెంకటేశ్వర్లు కుంకుమార్చన, అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఆవరణలోని పుట్ట, నాగశిలలకు భక్తులు పూజలు చేశారు. పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి పర్యవేక్షించారు.



ముఖద్వారం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తాం

- ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని పురాతన ఆలయం శ్రీ పాతాళ నాగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. పాతాళ నాగేశ్వరస్వామి ఆలయం తూర్పు ముఖద్వారాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సహకారాలు దాతల ప్రోత్సాహంతో ఆలయం మరింత అభివృద్ధి అవుతుందన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, వైస్ చైర్మన్ ఆర్‌డీ రామకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కౌన్సిలర్లు గడ్డం భాస్కర్‌రెడ్డి, దొంత లక్ష్మీదేవి, బాలిరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు దమ్మాల జనార్దన్, షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

సేంద్రియ పద్ధతిలో కంది సాగు

- జిల్లాలోనే అరుదుగా కొత్తరకం కంది సాగు
- రైతులకు ఆదర్శంగా సూర్యరంగారెడ్డి



కందిపంట వద్ద పాలుగుళ్ల సూర్యరంగారెడ్డి

గిద్దలూరు రూరల్: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకునేందుకు ఆ రైతు వినూత్న పద్ధతులు అవలంభించడమే కాకుండా పూర్తి ఆరోగ్యకర పంటను అందించాలనే లక్ష్యంతో జిల్లాలోనే అరుదుగా కొత్తరకం కంది పంటను గిద్దలూరు మండలం కంచిపల్లెలో పండిస్తూ రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. కంచిపల్లె గ్రామానికి చెందిన పాలుగుళ్ల సూర్యరంగారెడ్డి తనకు ఉన్న 2.75 ఎకరాల్లో సేంద్రియ పద్ధతుల వాడకం ద్వారా వ్యవసాయ పంటలను సాగుబడి చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నాడు. కందిలో స్కంద 111 రకం కొత్త సాగుబడిని గిద్దలూరు నియోజకవర్గానికి పరిచయం చేశాడని చెప్పవచ్చు. ఒక వైపు వ్యవసాయశాఖ అధికారులు మాత్రం ఈ రకం కంది సాగు జిల్లాలోనే అరుదుగా సాగు చేస్తున్నారని చెబుతున్నారు. ఈ రకం పంట సాగు కోసం రైతు సూర్యరంగారెడ్డి తెలంగాణలోని సూర్యాపేటలో విత్తనాలను 2 కిలోల విత్తనాలను కిలో రూ.600 ప్రకారం కొనుగోలు చేశాడు. తదుపరి తన పొలంలో జంటసాలు పద్ధతిలో విత్తనాలు నాటి సాగు ప్రారంభించారు. ఎకరం పొలంలో విత్తనాలు కొనుగోలు, కలుపు కూలీలు, వేప నూనెతో ప్లాకెయిన్ కలిపి స్ప్రే చేయడం వంటి వాటి మొత్తం ఖర్చులు మొత్తం రూ.6 వేలు ఖర్చు చేసినట్లు రైతు తెలిపాడు. పంట విరివిగా కాసి చూపరులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఈ రకమైన మంచి మేలిరకంగా పంటసాగు మన ప్రాంతంలోనే అరుదుగా పండిస్తున్నారని వ్యవసాయశాఖ ఏఓ విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. పంట కాల పరిమితి 140 నుంచి 150 రోజులు ఉంటుందన్నారు. సాధారణ కంది పంట సాగు అయితే ఎకరాకు 4, 5 కింటాళ్లు అవుతాయి. స్కంద రకం కంది వాతావరణ పరిస్థితుల ఒడిదుడుకులకు తట్టుకుని, ఎండు తెగుళ్ల నుంచి తట్టుకుని 10 నుంచి 15 కింటాల వరకు అధిక దిగుబడిని ఇస్తుంది. ఈ రకం పప్పు దినుసులను గ్యాస్ ట్రబుల్ ఉన్న వారు సైతం నిరభ్యంతరంగా తినవచ్చని చెబుతున్నారు.

ఉద్యమ స్ఫూర్తి ప్రదాత బాలకృష్ణమ్మ



బాలకృష్ణమ్మకు నివాళులర్పిస్తున్న నాయకులు

దర్శి: ఉపాధ్యాయ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత దివంగత మార్పు బాలకృష్ణమ్మ అని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు కేవీజీ కీర్తి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బాలకృష్ణమ్మ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేవీజీ కీర్తి మాట్లాడారు. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకటేశ్వరరావు, బి.శ్రీనివాసులు, వి.బాలాజీ, బి.వెంకట్రావు, కె. వెంకటేశ్వరరావు, సీనియర్ కార్యకర్తలు బి.రంగారావు, కె.రవీంద్రరావు, కె.నాగరాజు, ఎన్.చెన్నయ్య, సత్యనారాయణ, రాజశేఖర్, రంగయ్య శెట్టి, వీరాంజనేయులు పాల్గొన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

మార్కాపురం: మార్కాపురం పట్టణ శివారులోని భగత్‌సింగ్ కాలనీలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్సై కోటేశ్వరరావు తెలిపారు. అలాగే కందుల మల్లారెడ్డి కాలనీలో అక్రమంగా మద్యం అమ్ముతున్న కాశీ విశ్వనాథ్‌ను అరెస్టు చేసి ఆరు క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

కురిచేడు మండలంలో..

కురిచేడు: మండలంలోని ఆవులమంద, నాంచారపురం గ్రామాల పరిధి పొలాల్లో పేకాట ఆడుతున్న వారిని ఎస్‌ఐ దేవకుమార్, సెబ్ ఎస్‌ఐ మారం శ్రీధర్‌బాబులు తమ సిబ్బందితో దాడి చేసి ఆదివారం అరెస్టు చేశారు. తమకు అందిన సమాచారం ప్రకారం అకస్మాత్తుగా దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసి, వారి వద్ద ఉన్న రూ.6830లను, 2 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఎస్‌ఐ దేవకుమార్ తెలిపారు.

కోడిపందెం రాయుళ్లు కూడా..

దొనకొండ: మండలంలోని గంగదేవిపల్లి పంచాయతీ దొండపాడు పొలాల్లో కోడిపందెం రాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ సైదుబాబు తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. ఎస్‌ఐ తన సిబ్బందితో వెళ్లి కోడి పందేలు ఆడుతున్న 13 మందిని అదుపులోకి తీసుకుని 10 కోళ్లు, 23 బైకులు, 11 సెల్ ఫోన్లు, రూ.17,450 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసి సోమవారం దర్శి కోర్టుకు హాజరు పర్చనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వెంకటేశ్వరస్వామికి వెండి శంఖం బహూకరణ



వెండి శంఖాన్ని అందిస్తున్న శ్రీనివాస్ దంపతులు

మార్కాపురం: పట్టణంలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి వెండి శంఖాన్ని అల్లంపల్లి శ్రీనివాస్ దంపతులు ఆదివారం బహూకరించారు. ఆలయంలో పూజల అనంతరం వెండి శంఖాన్ని ఆలయ కార్యదర్శి రమేష్‌కు అందజేశారు.